సాక్షి మెదక్

గురువారం । 19 । జూన్ । 2025



చిరు వ్యాపారులకు చేయూత

చిరు వ్యాపారులకు చేయూతనిచ్చేందుకు మెప్మా రూ.50 వేల వరకు వడ్డీలేని రుణాలను అందజేస్తోంది. వివరాలు 8లో ▸



వికాసం మరింత జాప్యం

నిరుద్యోగ యువతకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకానికి తాత్కాలిక బ్రేక్ పడింది. వివరాలు 8లో ▸

దరఖాస్తు గడువు పొడిగింపు

మెదక్ కలెక్టరేట్: దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఉచితంగా అందించనున్న పరికరాల పంపిణీ దరఖాస్తులకు గడువు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు డీడబ్ల్యూఓ హైమావతి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 18వ తేదీతో దరఖాస్తు గడువు ముగియగా, ఈనెల 27వ తేదీ వరకు పొడిగించినట్లు తెలిపారు.

న్యూస్‌రీల్

మొక్కలు నాటి సంరక్షించాలి



మొక్క నాటుతున్న డీఈఓ రాధాకిషన్

చిన్నశంకరంపేట(మెదక్): ప్రభుత్వ పాఠశాలల్లో మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించాలని డీఈఓ రాధాకిషన్ అన్నారు. బుధవారం మండలంలోని సూరారం జెడ్పీ పాఠశాల ఆవరణలో మొక్కలను నాటారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏకాగ్రతతో చదువుకున్న విద్యార్థులకే మంచి భవిష్యత్ ఉంటుందని తెలిపారు. ఆయన వెంట హెచ్ఎం సాయిరెడ్డి ఉన్నారు.

పిల్లలకు అన్ని వసతులు కల్పించాలి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ

మెదక్ కలెక్టరేట్: ప్రత్యేక అవసరాలు గల పిల్లల అభిరుచి, ప్రతిభ గుర్తించి అవసరమైన అన్ని వసతులు కల్పించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ పేర్కొన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని భవిత కేంద్రాన్ని జిల్లా సేవాధికార సంస్థ సెక్రటరీ ఆర్ఎం శుభవల్లి సందర్శించారు. ఈసందర్భంగా పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పిల్లల భవిష్యత్ కోసం మరింత కృషి చేయాలని పిలుపునిచ్చారు. విద్యా నైపుణ్యాభివృద్ధి, ఆరోగ్య పరిరక్షణ వంటి రంగాల్లో వీరికి సహకారం అందించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ రామశర్మ, ఎంఈఓ శేఖర్, డీసీపీఓ కరుణశీల, జిల్లా విద్యాశాఖ సీఎంఓ రాజు తదితరులు పాల్గొన్నారు.

నర్సాపూర్‌లో విజిలెన్స్ తనిఖీలు

నర్సాపూర్: విద్యుత్ శాఖకు చెందిన విజిలెన్స్ అధికారులు బుధవారం నర్సాపూర్‌లో తనిఖీలు చేపట్టారు. పట్టణంలోని పలు దుకాణాలకు చెందిన కరెంట్ మీటర్లను పరిశీలించారు. కాగా విజిలెన్స్ అధికారుల తనిఖీ విషయాన్ని మండల విద్యుత్‌శాఖ ఏఈ రాంబాబు దృష్టికి తీసుకెళ్లగా, తమకు ఆ విషయం తెలియదన్నారు. వారి తనిఖీలలో ఎక్కడైనా కరెంట్ మీటరు సరిగా లేకపోయినా, విద్యుత్ దుర్వినియోగం అవుతున్నట్లు గుర్తిస్తే కేసు నమోదు చేసి తమకు సమాచారం ఇస్తారని ఏఈ వివరించారు.

రైతుభరోసా రూ.134.43 కోట్లు జమ

మెదక్ కలెక్టరేట్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రైతు భరోసా పథకంలో జిల్లాలోని చిన్న, సన్నకారు రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని కలెక్టర్ రాహుల్ రాజ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం వరకు జిల్లాలోని 2,25,485 మంది రైతుల ఖాతాల్లో రూ.134.43 కోట్ల నిధులు జమ అయినట్లు తెలిపారు. మిగితా రైతులకు ఎన్ని ఎకరాలు ఉంటే, అన్ని ఎకరాలకు పంట పెట్టుబడి సాయం కింద ప్రభుత్వం రైతు భరోసా నిధులను జమ చేయనుందని చెప్పారు. డబ్బులు ఖాతాలో పడని రైతులు మండల వ్యవసాయ అధికారిని సంప్రదించాలని సూచించారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు: డీఎల్‌పీఓ

మనోహరాబాద్(తూప్రాన్): ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలను తీసుకుంటామని డీఎల్‌పీఓ యాదయ్య హెచ్చరించారు. బుధవారం మండలంలోని కాళ్లకల్ పంచాయతీలో ప్రైవేట్ వెంచర్‌లలో గ్రామ పంచాయతీలకు కేటాయించిన 10 శాతం భూములపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సిండికేట్ వెంచర్‌లో గ్రామ పంచాయతీకి కేటాయించిన 10 శాతం భూమి కబ్జాకు గురైన అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. పై అధికారుల ఆదేశాల మేరకు గ్రామంలో ప్రజాసదస్సు నిర్వహించి వివరాలు సేకరించారు. అనంతరం డీఎల్‌పీఓ మాట్లాడుతూ.. ఈ భూమిపై కోర్టులో కేసులుండటంతో పూర్తి వివరాలు రాలేదని, హెచ్ఎండీఏ పరిధిలో ఉండటంతో వారితో కలిసి పూర్తి నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు నత్తి మల్లేష్, కమ్మరి వెంకటేశం, నాయకులు వీరబోయిన గోపాల్, వెంకటేశంగుప్తా, పంచాయతీ కార్యదర్శి ప్రియాంక, ఆర్ఐ దీక్షిత్ తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లను ఎదగనివ్వాలి

జహీరాబాద్: ఆడపిల్లను చదివించి ఆకాశమంతా ఎగదనివ్వాలని జిల్లా మహిళా సాధికారత కేంద్రం సమన్వయకర్త పల్లవి అన్నారు. బుధవారం మండలంలోని పస్తాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో బేటీ బచావో- బేటీ పడావో అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

బడి బస్.. ఫిట్‌లెస్!

నూతన విద్యా సంవత్సరం ప్రారంభమై వారం రోజులు గడిచిపోయింది. రోడ్లపై బడి బస్సులు రయ్ రయ్‌మని విద్యార్థులతో తిరిగేస్తున్నాయి. అయితే వాటిలో ఎన్ని బస్సులు నిబంధనలు పాటిస్తున్నాయనేది ప్రశ్నార్థకంగా మారింది. ఇంకా ఫిట్‌నెస్ చేయించుకోని బస్సులు ఉన్నాయనే విషయం ఆందోళన కలిగిస్తోంది. ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు, ఇప్పటికే 15 బస్సులను సీజ్ చేశారు.

– మెదక్‌జోన్/తూప్రాన్

జిల్లాలో 99 కాలం చెల్లిన బస్సులు

- ఇప్పటివరకు 15 సీజ్..
- ముమ్మరంగా కొనసాగుతున్న తనిఖీలు



జిల్లావ్యాప్తంగా 105 ప్రైవేట్ పాఠశాలలు ఉండగా, వాటిలో 45 వేల పైచిలుకు విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇందులో హాస్టళ్లలో ఉంటూ 20 వేల మంది చదువుకుంటుండగా, మరో 25 వేల మంది గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు నిత్యం ఇంటి నుంచి బస్సులు, ఇతర వాహనాల్లో బడులకు వెళ్తున్నారు. వీరికోసం వివిధ పాఠశాలలకు చెందిన యాజమాన్యాలు 313 బస్సులను వినియోగిస్తున్నాయి. ఏటా బస్సుల ఫిట్‌నెస్ తప్పనిసరిగా చూడాల్సిన బాధ్యత ఆర్టీఏ అధికారులపై ఉంటుంది. దీంతో వారు 99 బస్సులు కాలం చెల్లినవిగా గుర్తించి, వాటిలో పిల్లలను తరలించవద్దని ఆదేశాలు జారీ చేశారు. అంతేకాకుండా ఫిట్‌నెస్ లేనివి మరో 15 బస్సులను సీజ్ చేశారు. పాఠశాలలు ప్రారంభం కాకముందే వాటిని సరిచేసుకోవాల్సిన యాజమాన్యాలు నిర్లక్ష్యం వహించాయి. దీంతో అధికారులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తూ చర్యలు తీసుకుంటున్నారు. బడి బస్సు రోడ్డెక్కాలంటే 32 నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. అందులో ఫిట్‌నెస్, టైర్లు, సాంకేతిక సామర్థ్యం వంటి అంశాలపై అధికారులు పరిశీలించి సర్టిఫికెట్ జారీ చేస్తారు.

చర్యలు తప్పవు

పాఠశాల బస్సులను నిబంధనల ప్రకారం నడపాలి. జిల్లావ్యాప్తంగా 313 బస్సులు ఉండగా, ఇప్పటివరకు 15 బస్సులను సీజ్ చేశాం. అలాగే 99 బస్సులు కాలం చెల్లినవిగా గుర్తించాం. ఫిట్‌నెస్ చేయని పాఠశాలల వాహనాలను వెంటనే చేయించాలి. లేనిచో చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం.

– వెంకటస్వామి, ఆర్టీఏ, మెదక్

నిబంధనలు ఇవీ..

- 15 ఏళ్లు నిండిన వాహనాలను రవాణాకు ఉపయోగించకూడదు. స్కూల్ బస్సు పూర్తి కండిషన్‌లో ఉండాలి.
- విద్యాసంస్థ పేరు, ఫోన్ నంబర్, పూర్తి అడ్రస్ బస్సు ఎడమ వైపు, ముందుభాగంలో స్పష్టంగా కనిపించేలా రాయాలి.
- బస్సు నడిపే డ్రైవర్ వయసు 60 ఏళ్లకు మించకూడదు. బీపీ, షుగర్, కంటి జబ్బులు ఉండకూడదు.
- అతడికి పాఠశాల యాజమాన్యం ప్రతి 3 నెలలకోసారి ఆరోగ్య పరీక్షలు చేయించాలి.
- డ్రైవర్‌కు కనీసం 5 సంవత్సరాల అనుభవంతో పాటు సీనియర్ డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలి.
- ఏటా బస్సు ఫిట్‌నెస్ తప్పకుండా చేయించాలి. ఆర్టీఏ అధికారులు బస్సును పూర్తిగా చెక్ చేసి సర్టిఫికెట్ ఇచ్చాకే విద్యార్థులను తరలించాలి.
- ప్రతీ బస్సుల్లో ఒక అటెండర్ తప్పకుండా ఉండాలి. ప్రమాదావశాత్తు మంటలు చెలరేగితే ఆర్పే యంత్రం ఉంచాలి.
- సీట్ల పరిమితికి మించి విద్యార్థులను తరలించకూడదు.
- రోడ్డు భద్రతపై ఆర్టీఏ, పోలీస్‌శాఖలు ఏడాదికోసారి విద్యార్థులకు అవగాహన కల్పించాలి.

భూ భారతితో సమస్యలు పరిష్కారం

టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న నిర్మలారెడ్డి

సదాశివపేటరూరల్(సంగారెడ్డి): ప్రభుత్వం తెచ్చిన భూ భారతి చట్టంతో రెవెన్యూ సమస్యలు పరిష్కారమవుతాయని టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని వెల్టూర్, నందికంది గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. భూములపై పూర్తి హక్కులను కల్పించేందుకు ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని అమలు చేస్తోందన్నారు. రైతులు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం నందికందిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను అధికారులతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సరస్వతి, నాయబ్ తహసీల్దార్ బాలరాజ్, ఆర్ఐ గంగాధర్, పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కృష్ణ, మాజీ సర్పంచ్ లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు సిద్దన్న, నాయకులు పాల్గొన్నారు.

కార్మికశాఖ సహాయ అధికారి ఘెరావ్



అధికారిని నిలదీస్తున్న బాధితులు

నారాయణఖేడ్: ఖేడ్ కార్మికశాఖ సహాయ అధికారి గిరిరాజును బుధవారం వివిధ గ్రామాల బాధితులు నిలదీశారు. కార్మికశాఖ కార్డులు కలిగి ఉన్న మహిళా కార్మికుల మొదటి, రెండవ కాన్పులకు ప్రభుత్వం రూ.30 వేల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తుందని, దరఖాస్తు చేసుకొని ఏడాది దాటినా ప్రక్రియ ప్రారంభించకపోగా, నిర్లక్ష్యంగా సమాధానమిస్తున్నారంటూ వాగ్వాదానికి దిగారు. కొత్తగా కార్డులు కావాల్సిన వారికి సైతం ముడుపులు డిమాండ్ చేస్తున్నారని వాపోయారు. బాధితులకు కాంగ్రెస్ నాయకులు సంఘీభావం తెలిపారు.

తడి, పొడి చెత్తపై అవగాహన అవసరం

జోగిపేట(అందోల్): తడి, పొడి చెత్త వినియోగంపై విద్యార్థులకు అవగాహన అవసరమని మున్సిపల్ కమిషనర్ తిరుపతి అన్నారు. బుధవారం జోగిపేటలోని ఓ పాఠశాలలో వంద రోజుల ప్రణాళికలో భాగంగా వ్యర్థాల నిర్వహణ, ఎరువుల తయారీపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా కమిషనర్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. భవిష్యత్ తరాలకు మంచి ప్రకృతిని అందించాలన్నారు.

ధరణిలో అనేక అవకతవకలు

డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్



దరఖాస్తును స్వీకరిస్తున్న ఆంజనేయులుగౌడ్

నర్సాపూర్ రూరల్: భూ సమస్యల పరిష్కారం కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం భూ భారతి రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తుందని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ అన్నారు. బుధవారం మండలంలోని రెడ్డిపల్లిలో జరిగిన రెవెన్యూ సదస్సులో పాల్గొని మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన ధరణిలో అనేక అవకతవకలు జరగడంతో అనేక మంది రైతులు తమ భూములను కోల్పోయారని విమర్శించారు. పేద రైతులను మోసం చేసి కొంతమంది భూస్వాములు ధరణిలో భూములను సొంతం చేసుకున్నారని ఆరోపించారు. గతంలో అక్రమాలకు గురైన భూములను సరిచేసేందుకే మా ప్రభుత్వం భూ భారతిని తీసుకొచ్చిందన్నారు. భూ సమస్యలు ఉన్న ప్రతి ఒక్కరూ రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, రెడ్డిపల్లి మాజీ ఉప సర్పంచ్ అశోక్‌గౌడ్, శివప్రసాద్‌గౌడ్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి దరఖాస్తు ఆన్‌లైన్ చేయాలి

అదనపు కలెక్టర్ నగేశ్



రైతులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ నగేష్

మనోహరాబాద్(తూప్రాన్): భూ భారతి రెవెన్యూ సదస్సులో వచ్చిన ప్రతి దరఖాస్తును ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అదనపు కలెక్టర్ నగేశ్ అధికారులకు సూచించారు. బుధవారం మండలంలోని దండుపల్లిలో చేపట్టిన రెవెన్యూ సదస్సును సందర్శించి అధికారుల నుంచి వివరాలు సేకరించారు. రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. పీఓటీ, సాదా బైనామాల గురించి రైతులకు అవగాహన కల్పించారు. తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. మనోహరాబాద్, దండుపల్లిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో 39 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో డీటీ కౌశిక, ఆర్ఐ దీక్షిత్, సంపత్ పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి పరిశ్రమల చేయూత

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



అక్షరాభ్యాసం చేయిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి

జిన్నారం(పటాన్‌చెరు): ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి పరిశ్రమలు పెద్దపీట వేస్తున్నాయని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. బుధవారం గుమ్మడిదల మండలంలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్సీ అంజిరెడ్డితో కలిసి ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన చేశారు. గుమ్మడిదలలో హానర్ ల్యాబ్ పరిశ్రమ సహకారంతో సీసీ రోడ్లు, అంతర్గత మురికి కాలువలు, అన్నారం మోల్డ్ టెక్ పరిశ్రమ సహకారంతో నిర్మించిన జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాల, వావిలాలలో నిర్మించిన భవనాలను ప్రారంభించారు. గ్రామాల అభివృద్ధికి పరిశ్రమలు సహకారం అభినందనీయమన్నారు. ఈసందర్భంగా విద్యార్థులతో అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్, సీజీఆర్ ట్రస్ట్ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, జెడ్పీటీసీ కుమార్ గౌడ్, మాజీ ఎంపీపీ రవీందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



రుణ ప్రణాళిక వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు

లక్ష్యం మేర రుణాలు ఇవ్వాలి

కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్‌జోన్: బ్యాంకర్లు ఈ వార్షిక సంవత్సరానికి కేటాయించిన రూ. 6,517.51 కోట్ల రుణాలను రైతులతో పాటు ఇతర రంగాలకు అందించి లక్ష్యాన్ని చేరుకోవాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో సంబంధిత శాఖల అధికారులతో కలిసి రుణ ప్రణాళికను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్యాంకర్లు నిర్దేశించిన రుణాలను అందిస్తేనే రైతులతో పాటు ఇతర రుణ గ్రహీతలు అభివృద్ధి చెందే అవకాశం ఉంటుందన్నారు. అలాగే రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా స్వయం ఉపాధి రంగాలలో లక్ష్యాలను నిర్దేశించుకొని రుణాలు అందించాలన్నారు. గతేడాది వార్షిక రుణ ప్రణాళిక రూ. 5,857 కోట్ల రుణాల లక్ష్యం ఉండగా, ఇచ్చింది మాత్రం రూ. 4,366.84 కోట్లేనని తెలిపారు. ఈసారి అలా కాకుండా నిర్దేశించిన రుణాలు వందశాతం అందించేందుకు కృషి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, ఇరిగేషన్ ఈఈ శ్రీనివాస్, ఎల్‌డీఎం నరసింహమూర్తి, నాబార్డ్ డీడీఎం కృష్ణతేజ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల పరిశీలన

హవేళిఘణాపూర్(మెదక్)/మెదక్ కలెక్టరేట్: హవేళిఘణాపూర్ శివారులో ఉన్న ప్రభుత్వ భూములను కలెక్టర్ రాహుల్‌రాజ్ బుధవారం పరిశీలించారు. స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ, జిల్లా ఎలక్ట్రిసిటీ స్టోర్, అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్ తదితర నిర్మాణాలకు సంబంధించి ప్రభుత్వ పరిశీలించి పూర్తి వివరాలను మ్యాప్‌ను తయారు చేసి అందజేయాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. అనంతరం జిల్లా కేంద్రంలోని నర్సింగ్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లాకు నూతన నర్సింగ్ కాలేజ్ భవన నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని, త్వరలోనే పనులు ప్రారంభం అవుతాయని తెలిపారు.

ఆటపాటల అంగన్‌వాడీ బోధన

నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి



చిన్నారులతో అక్షరాభ్యాసం చేయిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: చిన్నారులకు సులభంగా అర్థమయ్యేలా అంగన్‌వాడీలో ఆటపాటల ద్వారా బోధన అందించాలని నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని శాస్త్రీనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో అమ్మమాట –అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో పాల్గొని చిన్నారులతో సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేనివిధంగా అంగన్‌వాడీ చిన్నారులకు సైతం ఏకరూప దుస్తులు, ప్రతీ బుధవారం ఎగ్ బిర్యానీ అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ సుజాత, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, మాజీ వైస్ చైర్మన్ దారం శంకర్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఖేడ్ మున్సిపాలిటీ ఆవరణలో ఏర్పాటు చేసిన భూ భారతి రెవెన్యూ సదస్సును ఆర్డీఓ అశోక చక్రవర్తితో కలిసి ప్రారంభించారు. గత ప్రభుత్వం వేల ఎకరాల ప్రభుత్వ భూమిని నాయకులకు పట్టాలుగా మార్పిడి చేసిందన్నారు. అలాగే ఒక్కో ఇందిరమ్మ ఇంటికి ఎనిమిది ట్రాక్టర్ల ఉచిత ఇసుకను సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. అలాగే ర్యాలమడుగు సబ్‌స్టేషన్‌కు ప్రత్యేక ఫీడర్‌ను ఏర్పాటు చేసి ప్రారంభించారు.

మత్తు పదార్థాల విక్రయాలపై నిఘా

ఎస్పీ డీవీ శ్రీనివాసరావు



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్పీ, అధికారులు

మెదక్ మున్సిపాలిటీ: విద్యా సంస్థలకు సమీపంలో ఎక్కడా పొగాకు విక్రయాలు జరగకుండా చర్యలు చేపట్టాలని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు ఆదేశించారు. బుధవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. విద్యాసంస్థలకు చుట్టుపక్కల దొంగచాటుగా పొగాకు, అనధికారంగా మద్యం, డ్రగ్స్ విక్రయించే వారిపై విద్యాసంస్థల యాజమాన్యాలు నిఘా ఏర్పాటు చేసుకొని పోలీస్‌లకు సమాచారం అందించాలని సూచించారు. అలాగే విద్యార్థులకు డ్రగ్స్ అనర్థాలపై అవగాహన కల్పించాలన్నారు. విద్యాసంస్థల ప్రవేశ సరిహద్దు గోడకు పొగాకు రహిత విద్య సంస్థ అనే సంకేతాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ మహేందర్, సైబర్ క్రైమ్ డీఎస్పీ సుభాష్ చంద్రబోస్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు పేదలకు వరం

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రంలో బుధవారం జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్లు పేదలకు వరం అన్నారు. 60 గజాల స్థలంలో హాలు, వంట, పడకగది ఉండేలా ప్రభుత్వం ప్రణాళిక రూపొందించిందన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ప్రణాళిక ప్రకారం ఇంటి నిర్మాణం త్వరగా పూర్తి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చిన్నారెడ్డి, హౌసింగ్ ఏఈ రియాజొద్దీన్, పంచాయతీ కార్యదర్శి నరేష్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు నవీన్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

ఇక డుమ్మాలకు చెక్

జిల్లా, మండల పరిషత్ కార్యాలయాల్లో బయోమెట్రిక్ హాజరు



- ఉద్యోగుల నుంచి ఆధార్ నంబర్, హోదా వివరాల సేకరణ
- ఉమ్మడి మెదక్ జిల్లాలో మూడు జిల్లా పరిషత్‌లు, 73 మండల పరిషత్‌లు

సాక్షి, సిద్దిపేట: జిల్లా ప్రజా పరిషత్‌లు, మండల పరిషత్ కార్యాలయాల్లో ఉద్యోగులకు బయోమెట్రిక్, ఫేస్ రికగ్నిషన్ హాజరును అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఉమ్మడి మెదక్ జిల్లాలో మూడు జిల్లా ప్రజా పరిషత్‌లు,73 మండల ప్రజా పరిషత్ కార్యాలయాల్లో బయోమెట్రిక్, ఫేస్ రికగ్నిషన్ సంబంధిత మెషీన్లు ఏర్పాటు చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. జిల్లా పరిషత్, మండల పరిషత్‌ల పాలక వర్గాల గడువు గతేడాది జూలై 4వ తేదీతో ముగిసింది. అప్పటి నుంచి ప్రభుత్వం ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతుంది. జిల్లా కలెక్టర్లు జిల్లా పరిషత్ ప్రత్యేక అధికారులుగా, మండల పరిషత్ ప్రత్యేక అధికారులుగా పలువురు జిల్లా అధికారులు వ్యవహరిస్తున్నారు. మండల పరిషత్‌లలో పలువురు అధికారులు సమయ పాలన పాటించడం లేదని గ్రామీణాభివృద్ధి శాఖకు ఫిర్యాదులు అందాయి. దీంతో రాష్ట్రవ్యాప్తంగా బయోమెట్రిక్, ఫేస్ రికగ్నిషన్ మెషీన్లు బిగించి సమయ పాలన పాటించే విధంగా చర్యలు తీసుకుంటున్నారు.

గతంలో ఆఫ్‌లైన్

గతంలో పలు కార్యాలయాల్లో బయోమెట్రిక్ హాజరు ఆఫ్‌లైన్‌లో ఉండేది. అది సక్రమంగా పని చేయకపోవడంతో పరికరాలు మూలన పడ్డాయి. దీంతో చాలామంది కార్యాలయ సిబ్బంది విధుల పట్ల జాప్యం వహించడం, తరచుగా డుమ్మా కొట్టడం, ఇంటికి వెళ్లడం, విధులకు రాకపోయినా వచ్చినట్లు నమోదు చేసుకుంటున్నారు. పలువురు ఉద్యోగులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండటంతో ప్రజలకు మెరుగైన సేవలు అందడం లేదు. వీటికి చెక్ పెట్టేందుకు ప్రభుత్వం ఆన్‌లైన్ బయోమెట్రిక్, ఫేస్ రికగ్నిషన్ ఏర్పాటుకు నిర్ణయం తీసుకుంది.



సిద్దిపేట జిల్లా పరిషత్‌లో ఏర్పాటు చేసిన బయోమెట్రిక్, ఫేస్ రికగ్నిషన్ మెషీన్‌లో హాజరు నమోదు చేసుకుంటున్న సిబ్బంది

ఉద్యోగుల వివరాల సేకరణ

బయోమెట్రిక్, ఫేస్ రికగ్నిషన్ మెషీన్‌లో ఉద్యోగులను గుర్తించేందుకు వారి నుంచి వివరాలు సేకరిస్తున్నారు. ఉద్యోగుల హోదా, ఆధార్ నంబర్, ఉద్యోగుల క్రమసంఖ్య తదితర వివరాలను బయోమెట్రిక్‌లో నమోదు చేస్తున్నారు. బయోమెట్రిక్ హాజరుతో ఉద్యోగులు ఏ సమయానికి వస్తున్నారు? ఎప్పుడు వెళ్తున్నారు? ఎంతమంది సిబ్బంది హాజరయ్యారు? అనే విషయాలను ఎప్పటికప్పుడు రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ కార్యాలయంకు తెలియనుంది.

జిల్లా	మండల పరిషత్‌లు
సిద్దిపేట	26
సంగారెడ్డి	26
మెదక్	21

క్లుప్తంగా

మూడేళ్ల జైలు

బాలికపై అసభ్యకరంగా ప్రవర్తించిన నిందితుడికి శిక్ష

చిన్నశంకరంపేట(మెదక్): బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన నార్సింగి మండలం శేరిపల్లికి చెందిన కోనేటి రాజుకు మూడేళ్ల జైలు శిక్ష, రూ.1000 జరిమాన విధిస్తు పోక్సో కోర్టు ఇన్చార్జి, జిల్లా ప్రధాన సెషన్స్ జడ్జి జి.నీలిమా తీర్పు ఇచ్చినట్లు జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు తెలిపారు. 2019లో తన సోదరుడితో ఆడుకుంటున్న ఆరేళ్ల బాలికకు పల్లీలు ఇస్తానని చెప్పి ఇంట్లోకి తీసుకెళ్లిన రాజు అసభ్యకరంగా ప్రవర్తించాడు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు నార్సింగి పోలీసులు కేసు నమోదు చేయగా. అప్పటి తూప్రాన్ డీఎస్పీ కిరణ్‌కుమార్‌రెడ్డి దర్యాప్తు నిర్వహించారు. ఈ కేసు విచారించిన జడ్జి పై తీర్పు ఇచ్చారు. నిందితుడికి శిక్ష పడేలా ఆధారాలతో సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టిన నార్సింగి ఎస్‌ఐ అహ్మద్ మోహినొద్దీన్‌కు ఎస్పీ అభినందించారు.

గంజాయి స్వాధీనం



నిందితుడిని చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

చిన్నశంకరంపేట(మెదక్): రామాయంపేట ఎక్సైజ్ సీఐ నరేందర్, ఎస్‌ఐ విజయ్ సిద్ధార్థ ఆధ్వర్యంలో చిన్నశంకరంపేట మండలంలోని ఖాజాపూర్ కావేరి పరిశ్రమ వద్ద బుధవారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా గంజాయి విక్రయిస్తున్న రాజ్‌దేవ్ సింగ్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద 272 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఎవరైనా గంజాయి రవాణ చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గంజాయి విక్రయించినట్లయితే తమకు సమాచారం అందించాలని కోరారు.

బెల్లం వ్యాపారికి జరిమానా

హుస్నాబాద్: బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించిన బెల్లం వ్యాపారికి రూ.50వేలు జరిమానా విధించినట్లు హుస్నాబాద్ ఎక్సైజ్ సీఐ పవన్ తెలిపారు. పట్టణానికి చెందిన కవిత ట్రేడర్స్ యజమాని చెప్యాల వెంకటేశ్ గతంలో హుస్నాబాద్ తహసీల్దార్ ఎదుట బైండోవర్ అయ్యాడు. ఇటీవల గుడుంబా తయారీకి బెల్లం, పట్టికలు సరఫరా చేసినందుకు స్టేషన్ ఘనపూర్‌లో కేసు నమోదైంది. అలాగే హుస్నాబాద్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో (8 టన్నుల) బెల్లం కేసులో నిందితుడిగా ఉండి బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించాడు. హుస్నాబాద్ తహసీల్దార్ లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు వెంకటేశ్‌కు రూ.50 వేల జరిమానా విధించినట్లు సీఐ పవన్ తెలిపారు.

మహిళ అదృశ్యం



నాగరాణి

జహీరాబాద్ టౌన్: మండలంలోని హుగ్గెల్లి గ్రామానికి చెందిన మట్టి నాగరాణి(24) అదృశ్యమైందని జహీరాబాద్ రూరల్ ఎస్.ఐ.కాశీనాథ్ తెలిపారు. గ్రామానికి చెందిన మట్టి సునీల్, నాగరాణి దంపతులు. కొడుకుకు యూనిఫాం, పుస్తకాలు కొనడానికి నాగరాణి ఈ నెల 9న జహీరాబాద్‌కు వెళ్లింది. రాత్రి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో ఆమె ఆచూకీ కోసం గాలించినా ఫలితం లేకుండా పోయింది. తండ్రి అంజన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు. ఆమె ఆచూకీ లభిస్తే 87126 56764 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

మద్యం తాగి స్కూలు బస్సు నడిపిన డ్రైవర్‌కు జైలు శిక్ష

పటాన్‌చెరు టౌన్: మద్యం సేవించి స్కూల్ బస్సును నడిపిన డ్రైవర్‌కు మూడు రోజుల జైలు శిక్ష పడింది. ఈ సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ లాలూ నాయక్ కథనం ప్రకారం... అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని స్కూల్ బస్సు డ్రైవర్స్‌కు బుధవారం డ్రంకెన్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. డ్రైవర్ డార్విన్ మద్యం సేవించినట్లు గుర్తించారు. నిందితుడిని పోలీసులు కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి మూడు రోజుల జైలు శిక్ష విధించినట్లు ట్రాఫిక్ సీఐ తెలిపారు.

350 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



అల్లాదుర్గం(మెదక్): అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ఈ సంఘటన అల్లాదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. అల్లాదుర్గం హైవేపై వాహనాలు తనిఖీ చేస్తున్నారు. సంగారెడ్డి వైపు నుంచి నాందేడ్ వెళ్లతున్న జీజే36వి 8883 నంబర్ గల లారీని ఆపారు. అందులో 350 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. సమాచారం అందుకున్న పౌరసరఫరాల శాఖ అధికారులు బియ్యాన్ని పెద్దశంకరంపేట సివిల్ సప్లయ్ గోదాంకు తరలించారు. ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శంకర్ తెలిపారు.

చిరు వ్యాపారులకు చేయూత

మెప్మా ఆధ్వర్యంలో రూ.50 వేల వడ్డీలేని రుణం

- ఆపై తీసుకుంటే 7 శాతం వడ్డీ సబ్సిడీ
- జిల్లావ్యాప్తంగా 25,476 మందికి చేయూత
- పీఎం స్వనిధిపై అవగాహన కార్యక్రమాలు



వీధి వ్యాపారులకు రుణాలను అందజేస్తున్న మెప్మా అధికారులు

సంగారెడ్డి టౌన్: చిరు వ్యాపారులకు చేయూత ఇచ్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలు అమలు చేస్తున్నాయి. ఆర్థికంగా వారిని ఆదుకుంటున్నాయి. అయితే.. సరైన ప్రచారం.. అవగాహన లేకపోవడంతో పేదల దరికి చేరడం లేదు. దీంతో మెప్మా అధికారులు ఒక అడుగు ముందుకేసి అర్హులైన చిరు వ్యాపారులను ఎంపిక చేసి వడ్డీలేని రుణం అందిస్తున్నారు. రోడ్లపై తోపుడు బండ్లు, చిన్నచిన్న దుకాణాలను పెట్టుకోవడానికి అవకాశాలను కల్పిస్తున్నారు. ఎస్‌బీఐ ద్వారా రుణాలను అందిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాల గురించి చాలా మందికి తెలియకపోవడంతో ప్రయోజనం పొందలేకపోతున్నారు. చిరువ్యాపారం చేసుకునే వారిని ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం 2020, జూన్‌లో ప్రధాన మంత్రి వీధి వ్యాపారుల ఆత్మనిర్భర్ పథకం ప్రవేశపెట్టింది. దీనినే పీఎం స్వనిధి అంటారు. ఈ పథకం ద్వారా దాదాపుగా వడ్డీలేని రుణం ఇస్తారు. వీధి వ్యాపారులకు సూక్ష్మ క్రెడిట్ సౌకర్యాలను కల్పించడమే ఈ పథకం ముఖ్యఉద్దేశం. ఎలాంటి పూచీకత్తు లేకుండా రుణం తీసుకోవచ్చు. పీఎం స్వనిధి స్కీమ్ ద్వారా రూ.50 వేల వరకు ఈజీగా రుణం తీసుకోవచ్చు. ఆపైన తీసుకుంటే ఏడు శాతం వడ్డీ రాయితీని పొందవచ్చు. ఏడాదిలోపు ఈ రుణం తిరిగి చెల్లించాల్సి ఉంటుంది. ఈ స్కీమ్ ద్వారా పెట్టుబడి పొందాలనుకునే వీధి వ్యాపారులు తొలి విడత కింద రూ.10 వేల రుణం తీసుకోవచ్చు. సకాలంలో చెల్లిస్తే రెండో విడత ద్వారా రూ.20 వేలు, ఆ తర్వాత రూ.50 వేలు రుణం పొందవచ్చు నిర్ణీత గడువులోగా రుణం చెల్లించినట్లయితే.. డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ ద్వారా ఈ రాయితీ వడ్డీ అనేది లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలోకి వస్తుంది. మరోవైపు.. డిజిటల్ పద్ధతిలో రుణం తిరిగి చేస్తే పట్టణ గృహ వ్యవహారాల శాఖ రూ.1,200 వరకు క్యాష్ బ్యాక్ సైతం ఇస్తుంది. ఈ రుణంపై వడ్డీ అనేది షెడ్యూల్డ్ బ్యాంకులు, గ్రామీణ ప్రాంతీయ బ్యాంకులు విధించే వడ్డీ ప్రకారం ఉంటుంది. ఈ రుణం పొందేందుకు అర్బన్ లోకల్ బాడీ జారీ చేసిన వెండింగ్ సర్టిఫికెట్ కలిగి ఉండాలి. లేదంటే వీధి వ్యాపారుల గుర్తింపు కార్డు కలిగి ఉండాలి. ఈ కార్డు లేకపోయినా రుణం పొందవచ్చు. అయితే, 30 రోజుల్లోగా గుర్తింపు కార్డు సంపాదించాల్సి ఉంటుంది. జిల్లాలో ఎనిమిది మున్సిపాలిటీల్లో ఇప్పటివరకు 25,476 మంది చిరువ్యాపారులు ఎస్‌బీఐలో రుణం తీసుకున్నారు. మెప్మా గ్రూపు సంఘాలుగా ఏర్పరిచి తక్కువ వడ్డీతో రుణాలను అందిస్తూ వ్యాపారులకు బాసటగా నిలుస్తోంది. జిల్లాలో జహీరాబాద్ మున్సిపాలిటీ మొదటి స్థానంలో ఉండగా, బొల్లారం మున్సిపాలిటీ చివరి స్థానంలో ఉంది.

రూ.50 వేల రుణం తీసుకున్న



సంగారెడ్డి పట్టణంలో నివాసం ఉంటున్న నాకు ఎటువంటి పనులు దొరక ఇబ్బందులు పడుతున్న సమయంలో మెప్మా అధికారులు సాయం అందించారు. పీఎం స్వనిధి పథకంతో రూ.50 వేల రుణాన్ని తీసుకొని సోడా బండి నడుపుతున్నా. ప్రతి నెల క్రమంగా కిస్తులు చెల్లిస్తున్న. ప్రస్తుతం వ్యాపారం బాగుంది.

– శంకర్, సంగారెడ్డి

సొంతంగా వ్యాపారం



మెప్మా సంఘం నుంచి రుణాన్ని పొంది మహిళలకు కావాల్సిన వివిధ రకాల వస్తువులను అమ్ముతూ వ్యాపారాన్ని ప్రారంభించాను. వచ్చే డబ్బులతో కుటుంబానికి ఆసరాగా ఉన్నాను.

– సుల్తానా బేగం, సంగారెడ్డి

పీఎం స్వనిధి పథకంతో లబ్ధి పొందుతున్నా



పీఎం స్వనిధి పథకం కింద రుణాన్ని తీసుకొని సదాశివపేట పట్టణంలో పండ్ల వ్యాపారం చేస్తున్నా. వచ్చిన ఆదాయంతో కుటుంబాన్ని ఎటువంటి లోటు లేకుండా చూసుకుంటున్నా. ఈ పథకం పేద, చిరు వ్యాపారులకు ఎంతో ఉపయోగపడుతుంది.

– మాణయ్య, సదాశివపేట

అవగాహన కల్పిస్తున్నాం



మున్సిపాలిటీలలో చిరు వ్యాపారులకు పథకంపై అవగాహన కల్పిస్తున్నాం. అర్హులను గుర్తించి రుణాలను అందిస్తున్నాం. నెల నెలా విడతల వారీగా రుణాలను కడుతూ సద్వినియోగం చేసుకుంటున్నారు. వ్యాపారాలు విస్తరించేలా మరింత అవగాహన కలిగేలా కృషి చేస్తాం.

– జిల్లా మెప్మా అధికారిణి గీత

వికాసం.. మరింత జాప్యం!

రాజీవ్ యువ వికాసం పథకానికి తాత్కాలిక బ్రేక్

- జూన్ 2న కార్యరూపం దాల్చని పథకం
- కేటగిరీ 1, 2లోపు వారికీ మంజూరుకాని వైనం
- పెండింగ్‌లో దరఖాస్తులు
- యూనిట్ల మార్పునకూ రాని అనుమతులు
- స్థానిక ఎన్నికల వార్తల నేపథ్యంలో మరింత ఆలస్యం!



నారాయణఖేడ్: నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అవకాశాలు మెరుగుపర్చి ఆర్థికంగా బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన రాజీవ్ యువవికాసం పథకానికి తాత్కాలికంగా బ్రేకులు పడినట్లు తెలుస్తుంది. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈనెల 2న తొలి విడత కింద రూ.లక్షలోపు యూనిట్లు మంజూరు చేస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ అది కార్యరూపం దాల్చలేదు. ఈ పథకంపై ఎన్నో ఆశలు పెట్టుకున్న యువకులు నిరాశకు లోనవుతున్నారు. పథకానికి బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల నుంచి భారీ స్పందన రావడంతో దరఖాస్తులు కుప్పలు తెప్పలుగా వచ్చి పడ్డాయి. అర్హులను ఎంపిక చేయడం, మొదటి విడతలో రూ.50వేలు, రూ.లక్షలోపు యూనిట్లను మంజూరు చేస్తామని ప్రకటించినా.. చివరి నిమిషంలో వాయిదా వేశారు. ఈ పథకానికి రూ.2లక్షల నుంచి రూ.4లక్షల యూనిట్ల కోసం దరఖాస్తులు భారీగా వచ్చాయి. చివరి నిమిషంలో లబ్ధిదారుల ఎంపికను వాయిదా వేశారు. దరఖాస్తులను పునః పరిశీలన చేసి మరింత లోతుగా విచారణ చేసిన తర్వాతే లబ్ధిదారుల ఎంపిక చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. దరఖాస్తులు వచ్చాక మండల, మున్సిపల్, జిల్లా స్థాయి కమిటీలు ఎంపిక సక్రమంగా చేపట్టారా లేదా అనే విషయంలో స్పష్టత లేదు.

కేటగిరీ మార్పుపై ఒత్తిడి

ప్రభుత్వం మొదటి విడతలో రూ.లక్షలోపు వారికి రుణం మంజూరు చేస్తామని అప్పట్లో వెల్లడించడంతో దరఖాస్తు చేసుకున్న 3, 4 కేటగిరీల్లో ఉన్న చాలా మంది తమను కేటగిరి 1 లేదా 2కి మార్చాలని అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేశారు. మార్పు కోసం ఎలాంటి ఆదేశాలు రాలేవని అధికారులు దరఖాస్తు దారులకు తిప్పి పంపించారు.

స్థానిక ఎన్నికలతో మరింత జాప్యం

త్వరలో రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నాయన్న వార్తల నేపథ్యంలో రాజీవ్ యువ వికాసం పథకం మరింత జాప్యం ఏర్పడనున్నందన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. పథకంలో కొందరిని ఎంపిక చేసి మరికొందరిని విస్మరించిన పక్షంలో మిగిలిన వారిలో ప్రభుత్వం పట్ల అసంతృప్తి ఏర్పడుతుందని, ఫలితంగా ఎన్నికల్లో దీని ప్రభావం ఉండనుందన్న భావన అధికార పార్టీలో వ్యక్తమవుతోంది. స్థానిక సంస్థల ఎన్నికలు లేదా ఆగస్టు వరకు పథకాన్ని ముందుకు జరిపే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తుంది.

భారీగా దరఖాస్తులు

పథకానికి జిల్లాలో ఊహించని విధంగా భారీ స్థాయిలో దరఖాస్తులు వచ్చాయి. ఏప్రిల్ 14వ తేదీలోపు దరఖాస్తులు సమర్పించాలని సూచించగా.. 51,657 మంది దరఖాస్తులను సమర్పించారు. అత్యధికంగా బీసీ వర్గాల నుంచి 6,546 యూనిట్లకు గాను 23,681 దరఖాస్తులు వచ్చాయి. ఎస్సీ విభాగంలో 7,415 యూనిట్లకు 14,480, మైనార్టీ విభాగంలో 2,456 యూనిట్లకు 8,378, ఎస్టీ విభాగంలో 2,502 యూనిట్లకు 4,232, ఈబీసీలో 1,654 యూనిట్లకు 817 దరఖాస్తులను సమర్పించారు. రూ.50వేల లోపు ఆర్థిక సహాయం కోసం దరఖాస్తు చేసుకున్న వారిని కేటగిరీ 1లో చేర్చారు. రూ.50వేల నుంచి రూ.1లక్ష మధ్య ఉన్న దరఖాస్తుల దారులను కేటగిరీ 2లో, రూ.1లక్ష నుంచి రూ.2లక్షల మధ్య ఉన్న దరఖాస్తులను కేటగిరీ 3గా, రూ.2లక్షల నుంచి రూ.4లక్షల మధ్య ఉన్న దరఖాస్తులను కేటగిరీ 4లో చేర్చారు.

ఎలాంటి ఆదేశాలు రాలేదు

రాజీవ్ యువ వికాసం పథకం గూర్చి ప్రభుత్వం నుంచి ఇంకా ఎలాంటి ఆదేశాలు రాలేదు. పథకం యూనిట్ కేటగిరీ మార్పు కోసం ఆదేశాలు రాలేదు, నిబంధనలు రావాల్సి ఉంది. వచ్చిన దరఖాస్తులను క్రోడీకరించి సిద్ధంగా ఉంచాం. ప్రభుత్వం నుంచి వచ్చిన ఆదేశాల మేరకు నడుచుకుంటాం.

– రామాచారి,
ఎస్సీ కార్పొరేషన్ ఈడీ, సంగారెడ్డి

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

- దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి
- సీఐటీయూ నేత రాజయ్య



గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న రాజయ్య

పటాన్‌చెరు టౌన్: లేబర్ కోడ్‌లు అమలైతే వెట్టి చాకిరిలోకి కార్మిక వర్గం నెట్టబడుతోందని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు రాజయ్య అన్నారు. బుధవారం సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం ఐడీఏ పాశమైలారంలోని సినర్జీ, వ్యాగ్ వాల్స్ పరిశ్రమల వద్ద జరిగిన కార్మికుల గేట్ మీటింగ్‌లలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ... జులై 9న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం పచ్చి కార్మిక వ్యతిరేకని, మోదీ విధానాలపై కార్మికులు తిరగబడాలని, నాలుగు లేబర్ కోడ్‌ల రద్దు కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. వీటిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేబర్ కోడ్ అమల్లోకి వస్తే 95 శాతం మంది కార్మిక వర్గం వెట్టి చాకిరిలో మగ్గాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎనిమిది గంటల పని విధానాన్ని 12 గంటలకు పెంచుతూ లేబర్ కోడ్‌లలో పొందుపరిచారని, కనీస వేతనాలు, పీఎఫ్, ఈఎస్‌ఐ, బోనస్ వంటి సదుపాయాలు అందని ద్రాక్షగా మారుతాయని ఆయన వివరించారు. కార్యక్రమంలో శాంత కుమార్, హరినాథ్ రెడ్డి, కృష్ణారెడ్డి, మురళి, రాజు, శ్రీనివాస్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రారెడ్డి



మాట్లాడుతున్న చంద్రారెడ్డి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పెన్షనర్‌లను రెండుగా విభజించి ప్రయోజనాలను దెబ్బతీసే విధంగా ఉన్న చట్టాలను కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని, ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు చంద్రారెడ్డి అన్నారు. బుధవారం ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో పార్లమెంట్‌లో ఆర్థికశాఖ మంత్రి ప్రవేశపెట్టిన బిల్లులో పెన్షనర్లను రెండుగా విభజిస్తూ, వారి ప్రయోజనాలు దెబ్బతీసే విధంగా ఉందన్నారు. దీంతో పెన్షనర్లకు తీవ్ర ఆర్థిక నష్టం వాటిల్లుతోందని చెప్పారు. అందువల్ల వెంటనే కేంద్రం చట్టాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. ఈనెల 23న కలెక్టర్ ద్వారా ప్రధాన మంత్రికి వినతి పత్రాన్ని అందించనున్నట్లు తెలిపారు. అందులో భాగంగా సంతకాల సేకరణ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి, కార్యవర్గ సభ్యులు మహంకాళి, రాములు, ఎల్లారెడ్డి, రాంరెడ్డి, సుందరయ్య, బాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

చావుకు అడ్డొచ్చిన కానిస్టేబుల్!

- ఆత్మహత్య చేసుకుంటానని పిల్లలతో సహా ఇంటి నుంచి వెళ్లిన మహిళ
- అనుమానాస్పదంగా తచ్చాడుతుండగా కానిస్టేబుల్ ఆరా..
- కౌన్సెలింగ్.. సఖి సిబ్బందికి అప్పగింత



సఖి సెంటర్ సిబ్బందికి మహిళను అప్పగిస్తున్న కానిస్టేబుల్ రవీందర్

సిద్దిపేటకమాన్: కుటుంబ కలహాలతో ఆత్మహత్య చేసుకుంటానని ఇంటి నుంచి బయలుదేరిన ఓ మహిళను కానిస్టేబుల్ కాపాడాడు. ఈ ఘటన సిద్దిపేటలో బుధవారం చోటు చేసుకుంది. ట్రాఫిక్ కానిస్టేబుల్ రవీందర్ బుధవారం పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద విధులు నిర్వహిస్తున్నాడు. కోటి లింగాల ఆలయం ప్రాంతంలో నివాసం ఉంటున్న శ్యామల కుటుంబ కలహాల కారణంగా తీవ్ర మనస్తాపం చెంది ఇద్దరు పిల్లలతో కలిసి ఆత్మహత్య చేసుకుంటానని చెప్పి ఇంటి నుంచి బయలుదేరింది. సిద్దిపేట బస్టాండ్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతుండగా.. అక్కడే విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ కానిస్టేబుల్ రవీందర్ ఆమెను పసిగట్టాడు. జరిగిన ఘటనపై ఆరా తీశాడు. కుటుంబ కలహాల కారణంగా పిల్లలతో కలసి చావాలని నిర్ణయించుకున్నానని ఆమె చెప్పింది. సమస్యకు ఆత్మహత్య పరిష్కారం కాదని ధైర్యం చెప్పి కౌన్సెలింగ్ నిర్వహించాడు. భర్త ఫోన్ నంబర్ అడగగా.. ఆమె తెలపడానికి నిరాకరించడంతో విషయాన్ని సఖి సెంటర్‌కు తెలిపాడు. వారొచ్చి పిల్లలతో సహా ఆమెను తీసుకెళ్లారు. కానిస్టేబుల్ సమయస్ఫూర్తికి తోటి సిబ్బంది, అక్కడున్న వారు అభినందించారు.

సైబర్ వలలో చిక్కి..

రూ.2.26 లక్షలు పోగొట్టుకున్న బాధితుడు

శివ్వంపేట(నర్సాపూర్): సైబర్ నేరగాళ్ల వలలో చిక్కి ఓ వ్యక్తి రూ.2.26 లక్షలు పోగొట్టుకున్నాడు. ఈ సంఘటన శివ్వంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ మధుకర్‌రెడ్డి కథనం ప్రకారం.. ఐదు నెలల క్రితం మండల పరిధిలోని ఎదుల్లాపూర్‌కు చెందిన మేకల చంద్రశేఖర్‌రెడ్డి ఫోన్‌కు గుర్తుతెలియని వ్యక్తుల నుంచి లింకు వచ్చింది. దానిని ఓపెన్ చేయడంతో రూ.500 పెట్టుబడి పెడితే డబుల్ ఇస్తామని నమ్మించారు. దీంతో తొలుత కొంత డబ్బు పెట్టడటంతో రెట్టింపు వచ్చాయి. ఇలా ఐదు నెలల నుంచి విడతల వారీగా 2 లక్షల 26 వేలు సైబర్ నేరగాళ్లు కాజేశారు. చివరకు మోసపోయానని గ్రహించిన బాధితుడు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అప్రమత్తమైన పోలీసులు సైబర్ నేరగాళ్లకు వెళ్లిన రూ.18 వేలను హోల్డ్‌లో పెట్టినట్లు చెప్పారు. గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే మెసేజ్ లింకులను ఓపెన్ చేయకూడదని ఎస్‌ఐ సూచించారు.

అత్తారింటికి వెళుతుండగా..

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



రాజేందర్

రామాయంపేట(మెదక్): రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. అత్తారింటికి వెళుతున్న క్రమంలో ఈ ప్రమాదం జరిగింది. ఈ సంఘటన మంగళవారం రాత్రి రామాయంపేట పట్టణ శివారులో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పట్టణానికి చెందిన దేవుని రాజేందర్ (27) ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. భార్య సంగీత ఇటీవల తన తల్లిగారి ఊరు సుతార్‌పల్లికి వెళ్లింది. ఒకసారి వచ్చిపోవాలని అత్తింటివారు పలుమార్లు ఫోన్ చేయగా, రాజేందర్ బైక్‌పై బయలుదేరాడు. పట్టణ శివారులో తండా వద్ద అకస్మాత్తుగా అడవి పంది అడ్డురావడంతో తప్పించబోయి రోడ్డు పక్కనే ఉన్న చెట్టుకు ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలైన రాజేందర్ అక్కడికక్కడే ప్రాణాలొదిలాడు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

భర్తతో చనువుగా ఉంటుందని..

పటాన్‌చెరు టౌన్: భర్తతో చనువుగా ఉంటున్న మహిళపై దాడి జరిగింది. బీడీఎల్ పీఎస్ పరిధిలో బుధవారం చోటుచేసుకున్న ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని రుద్రారం గ్రామానికి చెందిన అరుణ.. వెలిమెల గ్రామానికి చెందిన యాదయ్యతో వివాహం జరిగింది. యాదయ్య తరచూ మద్యం తాగుతుండడంతో భార్యాభర్తల మధ్య గొడవలు జరిగేవి. దీంతో అరుణ రుద్రారంలో ఉన్న తల్లిగారి ఇంటి వద్ద ఉంటోంది. ఈ నేపథ్యంలో అరుణ.. రుద్రారం గ్రామానికి చెందిన శ్రీనివాస్‌తో సన్నిహితంగా ఉంటోంది. దీంతో శ్రీనివాస్ భార్య మీనా ఆమె సోదరులు వెళ్లి, అరుణ భర్త యాదయ్య అతని పిల్లలపై ఇటీవల దాడి చేశారు. దీంతో ఈ నెల 16న అరుణ పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. అందరినీ పిలిపించి పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. అరుణ తమపై కేసు పెట్టినందుకు శ్రీనివాస్ భార్య మీనా మరి కొంత మందితో కలిసి అరుణ, శ్రీనివాస్‌లను వెలిమెల గ్రామానికి తీసుకెళ్లి మంగళవారం రాత్రి బంధించి దాడి చేశారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు.. ఘటనా స్థలానికి చేరుకొని దాడికి పాల్పడిన మీనాతో పాటు 9మందిపై కేసు నమోదు చేశారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య



జబ్బార్ హుస్సేన్

జిన్నారం (పటాన్‌చెరు): అప్పుల బాధ భరించలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన గుమ్మడిదల పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ భరత్ భూషణ్ తెలిపిన వివరాల ప్రకారం... మున్సిపాలిటీ పరిధిలోని దోమడుగు గ్రామానికి చెందిన జబ్బార్ హుస్సేన్ (38) ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. ఇంటి అవసరాల నిమిత్తం అప్పు చేశాడు. వాటిని తీర్చే మార్గం కానరాక ఈనెల 16న గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన భార్య హర్షియా బేగం నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు.

లైన్ ఇన్‌స్పెక్టర్‌పై కేసు

రామాయంపేట(మెదక్): విద్యుదాఘాతంతో ఓ గొర్రెల కాపరీ మృతి చెందాడు. అయితే.. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణమని మృతుడి బంధువులు ఫిర్యాదు మేరకు ట్రాన్స్‌కో లైన్ ఇన్‌స్పెక్టర్‌పై కేసు నమోదు చేశారు. పట్టణానికి చెందిన గాయంతి మల్లయ్య (44) గొర్రెల కాపరీగా పనిచేస్తున్నాడు. ఈ నెల పదో తేదీన కొచ్చెరువు ప్రాంతంలో గొర్రెలను మేపుతున్నాడు. కట్టపై ఇన్సులేటర్ లేని స్టే వైరుపై ఒరిగాడు. కరెంట్‌తో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి, తర్వాత హైదరాబాద్ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ బాలరాజు తెలిపారు.

బతికున్నా.. బాకీలు తీరవని..

- కౌలు రైతు ఆత్మహత్య
- కొండాపూర్‌లో ఘటన



రాజు

జగదేవ్‌పూర్(గజ్వేల్): పంటకు చేసిన అప్పులు.. అనారోగ్య సమస్యలు.. మరోవైపు కుటుంబ ఆర్థిక ఇబ్బందులు. బతికున్న బాకీలు తీరవని భావించి ఓ కౌలు రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం కొండాపూర్‌కు చెందిన తీగుళ్ల రాజు(38), రాధ దంపతులు, వీరికి ఇద్దరు కూతుళ్లు చైతన్య, వైష్ణవి, కొడుకు చరణ్ ఉన్నారు. గ్రామంలోనే మూడెకరాల భూమిని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. పంట పెట్టుబడికి, కుటుంబ పోషణ కోసం ప్రైవేట్ అప్పులు సుమారుగా రెండు లక్షలకు పైగా చేశారు. ప్రస్తుతం పత్తి, వరి పంటలను సాగు చేశారు. రాజు ఇటీవల మనోవేదనతో పక్షవాతానికి గురయ్యాడు. చేసిన అప్పులు తీర్చేమార్గం కానరాక తీవ్ర మానస్తానికి గురయ్యాడు. బతికున్న ప్రయోజనం లేదని మంగళవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి అపస్మారకస్థితికి చేరుకున్నాడు. కూలి పనులు ముగించుకుని ఇంటికి వచ్చిన భార్య రాధ.. భర్తను గమనించి వెంటనే గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం ఆర్‌వీఎంకు తరలించగా చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ చంద్రమోహన్ తెలిపారు.